సాక్షి నిజామాబాద్

శనివారం, 12, ఆగస్టు, 2023



నత్తనడకన 'లక్ష్మి' ఆధునికీకరణ

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు లక్ష్మి కాలువ ఆధునికీకరణకు ఐదేళ్ల క్రితం నిధులు మంజూరు కాగా.. పనులు నత్తనడకన సాగుతున్నాయి.

- IIలో ▸



విద్యార్థులకు అంబలి!

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్నం భోజనంలో అంబలి పంపిణీ చేయడానికి విద్యాశాఖ శ్రీకారం చుట్టింది.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
33.3 /25.3

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన

నిజామాబాద్ నాగారం : గృహలక్ష్మి పథకానికి దరఖాస్తుల స్వీకరణ ముగిసింది. ఈ నెల 20లోగా దరఖాస్తులను పూర్తిగా పరిశీలన చేయనున్నారు. మున్సిపాలిటీ పరిధిలో మూడు రోజుల్లో 2500 దరఖాస్తులు వచ్చినట్లు సంబంధిత అధికారి రమేశ్ తెలిపారు. వీటి ఆన్‌లైన్‌తో పాటు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయనున్నారు. క్షేత్రస్థాయిలో దరఖాస్తులతో అధికారులు పరిశీలించనున్నారు. తదుపరి పూర్తి నివేదికను ఈ నెల 20లోగా జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నారు. దరఖాస్తుల పరిశీలనకు 11 బృందాలు ఏర్పాటు చేశారు.

జెడ్పీ అతిథిగృహం మరమ్మతులకు ఆదేశాలు



నిజామాబాద్ నాగారం: జెడ్పీటీసీ సభ్యుల కోరిక మేరకు మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆదేశాలతో జిల్లా పరిషత్ ఆవరణలో ఉన్న జెడ్పీ అతిథిగృహం మరమ్మతులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం జెడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావు, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పరిశీలించారు. త్వరలో జెడ్పీ అతిథిగృహాన్ని అందుబాటులోకి తేవాలని సీఈవోను కలెక్టర్ ఆదేశించారు. సీఈవో గోవింద్ నాయక్, డిప్యూటీ సీఈవో వరదరాజన్, ఎస్ఈ పంచాయతీరాజ్ ప్రభాకర్ పాల్గొన్నారు.

వైన్స్‌లకు 118 దరఖాస్తులు

ఖలీల్‌వాడి : జిల్లాలోని 102 వైన్స్‌లకు 118 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు. నిజామాబాద్ 28, బోధన్ 36, ఆర్మూర్ 21, భీంగల్ 15, మోర్తాడ్‌లో 18 దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 172 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇంకా 31 వైన్స్‌లకు దరఖాస్తులు రాలేదన్నారు. లక్కీడ్రాలో పాల్గొనే వారు దరఖాస్తులు చేసుకోవారు. దరఖాస్తులకు ఈ నెల 18న గడువు ముగుస్తుందన్నారు. కొత్త మద్యం పాలసీ ప్రకారం వైన్స్ యజమానులకు ప్రభుత్వం ప్రత్యేక మార్జిన్ విధానం తీసుకువచ్చినట్లు తెలిపారు.

గణేశ్ గుప్తాకే జై..!

కేటీఆర్ జిల్లా పర్యటనలో నిజామాబాద్ అర్బన్ బీఆర్ఎస్ టిక్కెట్టుపై క్లారిటీ వచ్చినట్లయ్యిందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మంత్రి కేటీఆర్ బహిరంగ సభలో వరుసగా మూడోసారి బిగాల గణేశ్‌గుప్తాను గెలిపించాలని పిలుపునిచ్చారు.

- ఇందూరు పర్యటనలో కేటీఆర్ ప్రకటనతో క్లియర్!
- గణేశ్‌గుప్తాను 55వేల మెజారిటీతో గెలిపించాలన్న ఐటీ మంత్రి
- బీఆర్ఎస్ శ్రేణుల్లో పెరిగిన జోష్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : శాసనసభ ఎన్నికలు సమీపిస్తుండడంతో ఎమ్మెల్యే టిక్కెట్ల విషయంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటూనే ప్రత్యర్థి పార్టీల నుంచి అభ్యర్థులు ఎవరు వస్తారనే విషయమై లెక్కలు వేసుకుంటున్నారు. ప్రత్యర్థి ఏ పార్టీ నుంచి ఎవరు ఉంటే ఏవిధంగా ముందుకెళ్లాలనే విషయమై నాయకులు తగిన విధంగా వ్యూహాలు రచించుకుంటున్నారు. ప్రతి పార్టీ నుంచి టిక్కెట్ల ఆశావహులు తమ టిక్కెట్టు ప్రయత్నాలతో పాటు ప్రత్యర్థి పార్టీల నుంచి టిక్కెట్ల కేటాయింపు విషయమై మరింతగా దృష్టి పెడుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికార బీఆర్ఎస్ పార్టీలో సిట్టింగులను కొందరిని మారుస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో నిజామాబాద్ జిల్లాలో ఇద్దరు ముగ్గురు సిట్టింగు ఎమ్మెల్యేల్లో ఆందోళన నెలకొంది. కాగా నిజామాబాద్ అర్బన్ బీఆర్ఎస్ టిక్కెట్టు విషయమై కేటీఆర్ తాజా పర్యటన సందర్భంగా ఒక క్లారిటీ వచ్చినట్లేనని వివిధ వర్గాలు భావిస్తున్నాయి. నిజామాబాద్‌లో ఐటీ హబ్ ప్రారంభోత్సవానికి నగరానికి వచ్చిన మంత్రి కేటీఆర్ బహిరంగ సభలో పాల్గొన్నారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి వరుసగా మూడోసారి బిగాల గణేశ్‌గుప్తాను గెలిపించాలని కేటీఆర్ బహిరంగ సభలోనే పిలుపునిచ్చారు. ఏకంగా 55 వేల ఆధిక్యతతో గెలిపించాలని ప్రకటించడంతో ఎమ్మెల్యేతో పాటు ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది.

కేటీఆర్ ప్రకటనతో మళ్లీ గణేశ్ గుప్తాకే టిక్కెట్ ఖాయమని తేల్చినట్లైందని ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు చెబుతున్నారు. గణేశ్‌గుప్తా ఆధ్వర్యంలో నగరం అభివృద్ధిలో ముందుకు వెళుతోందని, త్వరలో నగరంలో ప్రతి డివిజన్‌కు రూ.1 కోటి ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అభివృద్ధికి కేరాఫ్ ఇందూరు అని కేటీఆర్ చెప్పడంతో అర్బన్ నియోజకవర్గం బీఆర్ఎస్‌లో జోష్ నెలకొంది. ఇదిలా ఉండగా ఇటీవల నిజామాబాద్‌లో విలేకరులతో చిట్‌చాట్ నేపథ్యంలో ఎమ్మెల్సీ కవిత సైతం గణేశ్‌గుప్తా గురించి ప్రస్తావిస్తూ ఆణిముత్యం అనడం గమనార్హం. దీంతో గణేశ్‌గుప్తాకు బేఫికర్ అనే చర్చ నడుస్తోంది.

ఆకుల లలిత ఆశలు ఆవిరి

మున్నూరు కాపు కోటాలో నిజామాబాద్ అర్బన్ టిక్కెట్టు ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆకుల లలితకు తాజా పరిణామాలతో ఆశలు ఆవిరి అయినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీ ఇస్తానని చెప్పినా కేసీఆర్ ఇవ్వలేదు. రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవి ఇవ్వడంతో దాన్ని ఆసరాగా చేసుకుని ఎక్కువగా నగరంలో పర్యటిస్తూ వచ్చారు. అదేవిధంగా మున్నూరు కాపు సంఘాలతో వరుస భేటీలు చేస్తూ వచ్చారు. అర్బన్ టిక్కెట్టు వస్తుందని ప్రచారం సైతం చేసుకున్నారు. ఈ క్రమంలో గణేశ్‌గుప్తాకే కేటీఆర్ జై కొట్టడంతో లలిత ఆశలు ఆవిరైనట్లు పార్టీలో చర్చ జరుగుతోంది.

అంచనాకు మించి సాగు



దొంకేశ్వర్‌లో సాగవుతున్న మొక్కజొన్న

- జిల్లాలో జోరుగా వానకాలం పంటలు
- మొక్కజొన్న వైపు మొగ్గుచూపిన రైతులు
- తగ్గిన సోయా, పసుపు విస్తీర్ణం
- నాలుగు లక్షల ఎకరాల్లో వరినాట్లు

డొంకేశ్వర్ (ఆర్మూర్) : వానకాలం సీజన్‌కు సంబంధించి విత్తనాలు విత్తడం, వరినాట్లు వేయడం దాదాపుగా పూర్తయింది. ఐతే, రైతులు అంచనాకు మించి జిల్లాలో పంటలు వేశారు. గతేడాది వానకాలంతో పోలిస్తే కూడా పంటలు ఎక్కువ సాగవుతున్నాయి. వరి తర్వాత మొక్కజొన్న వైపు రైతులు మొగ్గు చూపారు. మక్క కంటే సోయానే ఎక్కువ ఎకరాల్లో సాగు చేస్తున్నప్పటికీ గతంతో పోలిస్తే విస్తీర్ణం తగ్గింది. పసుపు కాకుండా జిల్లాలో 5.13 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కానీ, అంచనాకు మించి 5.63 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో అత్యధికంగా వరి 4 లక్షల ఎకరాలు ఉంది. మరో ఐదారు వేలల్లో మాత్రమే నాట్లు పడే అవకాశముంది. అయితే, పంటలు సాగు చేస్తున్న రైతులకు తెగుళ్లు, పురుగులు ఆందోళన కలిగిస్తున్నాయి. సోయాకు తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంది. దీంతో పురుగుల మందులు ఎక్కువగా కొడుతున్నారు. ఇటు వ్యవసాయ శాఖ కూడా కొరత ఏర్పడకుండా అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచింది. కాగా ఆన్‌లైన్‌లో పంటల వివరాల నమోదులో మొన్నటి వరకు బిజీగా ఉన్న వ్యవసాయాధికారులు ఇప్పుడిప్పుడే రిలీఫ్ అవుతున్నారు.

జిల్లాలో సాగవుతున్న ప్రధాన పంటలు.. (ఎకరాల్లో..)

పంట	అంచనా	సాగైంది
వరి	4,17,943	4,00,000
సోయా	58,714	50,187
మొక్కజొన్న	32,185	38,411
పసుపు	23,722	20,477
పత్తి	1,803	2,670
కంది	1,883	1,057
పెసర	151	32
మినుము	125	71
వేరు శనగ	204	185

పసుపు, పప్పుదినుసులు, సోయా తగ్గించారు..

మార్కెట్‌లో పసుపు, సోయా పంటలకు ఆశించిన ధర రాకపోవడంతో రైతులు వానకాలం సీజన్‌లో ఎక్కువగా సాగు చేయలేదు. గతేడాదితో పాటు ఈ ఏడాది అంచనా కంటే తక్కువగా సాగు చేశారు. సోయా ఎనిమిది నుంచి పది వేల ఎకరాల వరకు తగ్గింది. పసుపు కూడా దాదాపు మూడు వేల ఎకరాల వరకు తగ్గింది. అదే విధంగా పప్పుదినుసుల సాగు కూడా చాలా వరకు తగ్గించారు. కంది 800 ఎకరాలు, పెసర 120 ఎకరాలు, మినుములు 60 ఎకరాల వరకు తగ్గిపోయింది. ఆశ్చర్యపోయే విషయం ఏంటంటే పత్తిసాగు అంచనాకు మించి 2,670 ఎకరాల్లో సాగైంది. మొక్కజొన్న అంచనా కంటే ఆరున్నర వేల ఎకరాలు పెరిగింది.

సరిపడా ఎరువుల నిల్వలు

వానకాలం సీజన్‌కు సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచాం. ఎక్కడా ఎరువుల కొరత అనే మాట రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నాం ఎప్పటికప్పుడు రైలు వ్యాగన్ల ద్వారా జిల్లాకు తెప్పిస్తున్నాం. అవసరానికి అనుగుణంగా ఎరువులను కొనుగోలు చేసి తీసుకెళ్లాలి.

– వాజిద్ హుస్సేన్, జిల్లా వ్యవసాయాధికారి

మరో మూడు చెక్ డ్యాంలు మంజూరు

- సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపిన మంత్రి వేముల

కమ్మర్‌పల్లి : రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో బాల్కొండ నియోజకవర్గానికి మరో మూడు కొత్త చెక్ డ్యాంలు మంజూరు అయ్యాయి. అందుకు సంబంధించిన ఉత్తర్వులు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం జారీ చేసింది. భీంగల్ మండలం సాలింపురం వద్ద చెక్ డ్యామ్ కోసం రూ. 6.35 కోట్లు, కమ్మర్ పల్లి మండలం కోనాపూర్ వద్ద రూ. 4.10 కోట్లు, కమ్మర్‌పల్లి మండల కోనాపూర్ రాళ్లవాగు పరిధిలో చెక్ డ్యామ్ కోసం రూ. 3.97 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాంత రైతుల కోరిక మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజ్ఞప్తి చేయగా, కొత్తగా మూడు చెక్ డ్యాంలు మంజూరు చేశారని మంత్రి తెలిపారు. నియోజకవర్గ రైతుల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే కప్పల వాగు, పెద్ద వాగు మీద చెక్ డ్యాంలు నిర్మించుకున్నామని అన్నారు. దీంతో వాగులకు ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగాయని, బోర్లలో నీరు సమృద్ధిగా ఉండడంతో రైతులు సంతోషంగా ఉన్నారని అన్నారు. సీఎం కేసీఆర్ కు బాల్కొండ నియోజకవర్గ రైతాంగం తరపున ధన్యవాదాలు తెలియజేశారు.

ఎంపీ అనుచిత వ్యాఖ్యలు సహించబోం

- జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు హెచ్చరిక

నిజామాబాద్‌నాగారం : ఎంపీ అర్వింద్.. నోరు జాగ్రత్త పెట్టుకో.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అర్వింద్ ఎంపీగా గెలిచి దాదాపు నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్నాయన్నారు. ఎన్నికల్లో గెలవగానే ఐదు రోజుల్లో తెస్తానన్న పసుపు బోర్డును ఇప్పటికీ తీసుకురాలేదన్నారు. ఎంపీ నియోజకవర్గానికి, జిల్లాకు చేసిందేమి లేదని అన్నీ మోసపూరిత మాటలే అన్నారు. ఎన్నో కష్టాలను ఓర్చి తెలంగాణను సాధించుకున్నామని, ప్రభుత్వం చేసే అభివృద్ధిని చూసి ఓర్వలేక అనవసరమైన వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తా లేకుంటే నేనే కొత్తది కట్టిస్తా అన్నావు కదా... ఇప్పుడు ఎక్కడ పోయావని ఎంపీని ప్రశ్నించారు. ఎంపీకి ధైర్యం ఉంటే మళ్లీ నిజామాబాద్ పార్లమెంటు స్థానం నుంచే పోటీ చేయాలన్నారు. నిన్ను ఓడించడానికి ఎమ్మెల్సీ కవిత రెడీగా ఉన్నారని, నీకు డిపాజిట్లు గల్లంతయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయని విఠల్ రావు పేర్కొన్నారు.

టీఎస్ బీపాస్‌పై అవగాహన ఉండాలి

- జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు



మాట్లాడుతున్న టీఎస్ బీపాస్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు

నిజామాబాద్‌నాగారం : నుడా పరిధిలోని గ్రామ పంచాయతీల్లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన టీఎస్ బీపాస్‌పై అవగాహన ఉండాలని టీఎస్‌బీపాస్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ ఆర్ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో టీఎస్ బీపాస్ ఓరియెంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జాయింట్ డైరెక్టర్ హాజరై మాట్లాడారు. నుడా పరిధిలోని గ్రామ పంచాయతీల్లో ఇళ్లకు సంబంధించి అనుమతి ఇచ్చే సమయంలో టీఎస్‌బీపాస్ చట్టం నియమనిబంధనలు పాటించాల్సిందేన్నారు. ఇష్టారాజ్యంగా అనుమతులు ఇవ్వద్దన్నారు. పంచాయతీ కార్యదర్శులు, పీఆర్ ఏఈలు, తహసీల్దార్‌లకు అవగాహన ఉండాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే టౌన్‌ప్లానింగ్, నుడా కార్యాలయంలో నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నుడా సీపీవో శ్యామ్, అధికారి జ్యోతి, ఏడీ రాకేష్, కె ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగని హత్యల పరంపర

- శారీరక సంబంధాలు.. భూ తగాదాలు ఓ కారణం
- నగరంలో రౌడీ షీటర్లు ఆధిపత్య పోరులో బలవుతున్నారు
- ప్రియుడి చేతిలోనే యువతులు ప్రాణాలు విడుస్తున్నారు
- ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 27 హత్యలు

■ జూన్ 1న ఎడపల్లి శివారులో నిజామాబాద్‌కు చెందిన రౌడీషీటర్ ఆరీఫ్‌డాన్ (28) బోధన్ కోర్టుకు హాజరై తిరిగి వస్తుండగా కత్తుల దాడిలో మృతి చెందాడు. గతంలో ఆరీఫ్ డాన్ చేతిలో హత్యకు గురైన ఇబ్రహీం ఛావూస్ ఆలియాస్ జంగిల్ ఇబ్బు అనుచరులు ఈ దాడి జరిపారు.

■ ఆర్మూర్ పట్టణంలోని జిరాయిత్‌నగర్‌లో బంగారు నగలు, డబ్బుల కోసం బంధువు రాజవ్వ(72), గంగవ్వ(62)లను కొట్టి చంపేశారు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



ఖలీల్‌వాడి : పాత కక్షలు, వివాహేతర సంబంధాలు, వ్యవసాయ భూముల పంచాయితీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారం వివాదాలు, బంగారు నగలు, డబ్బుల కోసం, క్షణికావేశంలోనూ హత్యలు జిల్లాలో జరుగుతున్నాయి. జిల్లా కేంద్రంలో పీడీఎస్ బియ్యం, గంజాయి, దొంగతనాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణ ఆధిపత్య పోరులో ఇద్దరు రౌడీషీటర్లు హత్యకు గురయ్యారు. కత్తి పట్టిన రౌడీల కథ చివరికి కత్తితోనే ముగిసిపోతుంది. కారణాలు ఏమైనా ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 27 హత్యలు జరిగాయి.

వివాహేతర సంబంధాలు..

వివాహేతర సంబంధాలతో కొందరు మహిళలు, పురుషులు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. విషయం బయటకు తెలియడంతో కుటుంబసభ్యుల ఆగ్రహాలకులోనై హత్యలు జరుగుతున్నాయి. మహిళతో శారీరక సంబంధం కలిగిన వ్యక్తే చివరికి ఆ మహిళను హతమారుస్తున్నాడు. పెళ్లి చేసుకోవాలని కోరడమే వంచిత మహిళలకు శాపమవుతోంది.

భూ తగాదాలతో..

భూ తగాదాలతో పంచాయితీలు ప్రాణాల మీదికి తీసుకువస్తున్నాయి. భూములకు విలువ పెరగడంతో భూ పంచాయితీలు పెరిగిపోతున్నాయి. వ్యవసాయ భూములు, ఇంటిస్థలాల విషయంలో ఒకరిపైఒకరు దాడులకు పాల్పడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారుల మధ్య ఈ పంచాయితీలు ఎక్కువగా నడుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూముల వద్ద, బోరుబావులు, పంట భూములకు వెళ్లే దారి వద్ద, బావుల వద్ద ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇరువర్గాల వారు సంయమనంతో శ్రేయోభిలాషుల మధ్య పరిష్కరించుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని పోలీసులు, న్యాయ వ్యవస్థకు చెందిన వారు చెబుతున్నాయి.

ప్రేమ వ్యవహారంలో..

ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే యువతులు ఆత్మహత్య చేసుకున్న ఘటనలు ఉన్నాయి. అంతేగాకుండా ప్రేమ వివాహాలను ఇరుకుటుంబాల వారు ఒప్పుకోకపోవడంతో ప్రేమ జంటలు ఆత్మహత్య చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. ప్రేమ వ్యవహారంలో ప్రియుడి చేతిలోనే యువతులు హత్యకు గురవుతున్నారు. యువతులు వేధింపులకు గురయితే షీ టీమ్‌లకు సమాచారం అందించాలి.లేదంటే డయల్ 100 చేస్తే సమస్య పరిష్కారమవుతుంది. ప్రేమ పేరుతో యువతులు మోసపోవద్దని పోలీసులు సూచిస్తున్నారు.

ఇతర కారణాలు..

పీడీఎస్ బియ్యం దందా, గంజాయి రవాణా, ప్రభుత్వ స్థలాల ఆక్రమణ తదితర వాటిలో ఆధిపత్యం కోసం ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడి హత్యలకు గురవుతున్నారు. గ్రూపులుగా ఏర్పడి దాడులకు పాల్పడిన ఘటనలు జిల్లా కేంద్రంలో తరుచూ జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే రౌడీషీటర్లు ఇబ్రహీంఛావూస్ ఆలియాస్ జంగిల్ ఇబ్బు, ఆరిఫ్‌డాన్ హత్యకు హతమయ్యారు.

జిల్లాలో జరిగిన హత్యలు

సంవత్సరం	హత్యలు	సంవత్సరం	హత్యలు
2020	39	2023	27
2021	46	జనవరి నుంచి	
2022	45	ఆగస్టు వరకు	

4 టీఎంసీల దూరంలోనే..

- ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటి మట్టం 90 టీఎంసీలు
- 86 టీఎంసీల వద్దనే నీటి నిల్వ
- ఎగువ ప్రాంతాల నుంచి తగ్గిపోయిన ఇన్‌ఫ్లో
- ఖరీఫ్ పంటలకు 60 టీఎంసీల నీటి కేటాయింపు



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ప్రస్తుత నీటి మట్టం

బాల్కొండ: శ్రీ రాంసాగర్ ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి నిల్వ 90 టీఎంసీలు కాగా 86 టీఎంసీల వద్దనే ప్రాజెక్ట్ అధికారులు నీరు నిల్వ ఉంచుతున్నారు. దీంతో నాలుగు టీఎంసీల దూరంలోనే ప్రాజెక్ట్ నీటి నిల్వ నిలిచి పోయింది. గతేడాది నుంచి ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ 75 టీఎంసీలకు చేరగానే ప్రాజెక్ట్ నుంచి గోదావరిలోకి వరద గేట్ల ద్వారా నీటి విడుదల చేపడుతున్నారు. ప్రస్తుత సంవత్సరం కూడ ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ 75 టీఎంసీలకు చేరగానే ప్రాజెక్ట్ నుంచి గోదావరిలోకి నీటి విడుదలను చేపట్టారు. గరిష్టంగా 3.5 లక్షల నీటిని వదిలారు. దీంతో 38 టీఎంసీల నీరు గోదావరి పాలైంది. అయినా ఇప్పటికీ ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి నిల్వకు నీరు చేరుకోలేదు. సెప్టెంబర్ వరకు ఎగువ ప్రాంతాల నుంచి వరదలు వచ్చే అవకాశం ఉందని ప్రాజెక్ట్ అధికారులు నమ్మకంగా చెప్తున్నారు.అయితే అంత వరకు ప్రాజెక్ట్ నిండుకుండలా నీటి నిల్వ ఉంచవచ్చు అంటున్నారు.

అంత నమ్మకం ఉంటే..

ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుందని నమ్మకంతోనే ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీరు నిల్వకు చేరక ముందే వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటిని వదులుతున్న అధికారులు.. అంతే నమ్మకంతో ఆయకట్టుకు సకాలంలో ఎందుకు నీటి విడుదల చేపట్టడం లేదని ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నారు. కాకతీయ కాలువ ద్వారా లీకేజీ నీరు 100 క్యూసెక్కులు వదలాలని రైతులు మొరపెట్టుకుంటున్నారు. అయితే అధికారులు ఇంకా సమయం ఉందంటూ లీకేజీ నీరు వదలకుండా గోదావరిలోకి మాత్రం వదిలారు. గతేడాది నుంచి ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ, విడుదల అంతా గందరగోళంగా మారుతుంది.

60 టీఎంసీల కేటాయింపు..

ప్రస్తుత వానాకాల సీజన్‌లో ఆయకట్టుకు వారాబందీ ప్రకారం నీటి విడుదల చేపట్టడానికి ప్రాజెక్ట్ అధికారులు ప్రణాళిక తయారు చేశారు. సీజన్‌కు 60 టీఎంసీల నీటిని కేటయించినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. ఇప్పటి వరకు ఆయకట్టుకు 5 టీఎంసీల నీటి విడుదల చేశారు. మరో 55 టీఎంసీల నీటిని ఆయకట్టుకు వినియోగించాల్సి ఉంటుంది. కాగా ప్రస్తుతం ఉన్న నీటి నిల్వ లెక్కల ప్రకారం ప్రాజెక్ట్‌లో 30 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంటుంది. వానా కాల సీజన్‌లో కేటాయింపు ప్రకారం కాకుండా తక్కువ మొత్తం నీటి వినియోగం జరుగుతోందని ప్రాజెక్ట్ అధికారులు అంటున్నారు.

తగ్గిన వరద నీరు..

ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతాల నుంచి 7130 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతతీయ కాలువ ద్వారా 5500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా100 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 180 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్ ద్వార 270 క్యూసెక్కులు , మిషన్ భగీరథ ద్వారా 152 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 628 క్యూసెక్కుల నీరు పోతోంది.

క్లుప్తంగా

పీజీ పరీక్షలు వాయిదా

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 14 నుంచి ప్రారంభం కావాల్సిన పీజీ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు కంట్రోలర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ పరీక్షలు జరుగుతున్న దృష్ట్యా పీజీ పరీక్షలను విద్యార్థుల వినతి మేరకు ఈ నెల 16 నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. పీజీ 2వ, 4వ సెమిస్టర్, ఇంటిగ్రేటెడ్ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ 2వ, 4వ, 6వ సెమిస్టర్, బీఎల్ఐఎస్సీ 2వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు ఈ నెల 16 నుంచి ప్రారంభమవుతాయన్నారు.

సయ్యదా అమెనా మక్బూల్‌కు డాక్టరేట్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ విభాగం పరిశోధక విద్యార్థిని సయ్యదా అమెనా మక్బూల్ డాక్టరేట్ సాధించారు. తెయూ ఉర్దూ విభాగం మాజీ ప్రొఫెసర్ అత్తర్ సుల్తానా పర్యవేక్షణలో 'సయ్యద్ ఫాజిల్ హుస్సేన్ పర్వేజ్‌కి సహఫాతి ఖిద్మత్' అనే అంశంపై అమెనా పరిశోధన పూర్తి చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. శుక్రవారం తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మినీ సెమినార్ హాల్‌లో నిర్వహించిన వైవావోస్‌కు ఉస్మానియా యూనివర్సిటీ ఉర్దూ ప్రొఫెసర్ ఎస్ఏషకూర్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. డాక్టరేట్ సాధించిన మక్బూల్‌ను శాలువాతో సత్కరించారు.

చంద్రయాన్- 3 వీక్షణకు ఎంపిక



కె వెంగనవాసు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న వెంగనవాసు చంద్రుడిపై చంద్రయాన్- 3 అడుగుపెట్టే విధానం చూడటానికి ఎంపికయ్యాడు. ఈ మేరకు బెంగళూరు ఇస్రో కంట్రోల్ సెంటర్ నుంచి విద్యార్థికి ఆహ్వానం వచ్చింది. తెలంగాణ నుంచి వెంగనవాసు ఒక్కడే ఎంపికయ్యాడు.

కేజీబీవీ అర్హత పరీక్ష ఫలితాలు విడుదల

నిజామాబాద్‌అర్బన్: కేజీబీవీలో ఖాళీల భర్తీకి ఇటీవల నిర్వహించిన అర్హత పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో జిల్లాకు సంబంధించిన అర్హుల జాబితాను schooledu. telangana. gov. in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. మెరిట్ లిస్టును కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో పొందుపరిచినట్లు తెలిపారు.

సీజ్ చేసినా.. తరగతుల నిర్వహణ

నిజామాబాద్‌అర్బన్: అనుమతి లేకుండా కొనసాగుతున్న పాఠశాలను సీజ్ చేసినా తరగతులు నిర్వహిస్తున్నారు. నగరంలోని శ్రీచైతన్య పాఠశాలలో 8, 9, 10 తరగతులు అనుమతులు లేకుండా కొనసాగుతుండటంతో డీఈవో దుర్గాప్రసాద్ గత నెలలో సీజ్ చేశారు. ఆ తరగతి గదులకు తాళం వేసి విద్యార్థులను ఇతర పాఠశాలలకు పంపించాలని ఆదేశించారు. కానీ సదరు పాఠశాల మాత్రం మళ్లీ తరగతులు నిర్వహిస్తోంది. దీంతో శుక్రవారం టీజీవీపీ నాయకులు వెళ్లి పాఠశాలలో పరిశీలించారు. 8, 9, 10 తరగతులు కొనసాగుతుండటంతో విద్యార్థులను బయటకు పంపారు. అనంతరం డీఈవో, ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. టీజీవీపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామవత్ లాల్‌సింగ్, మహేష్‌రెడ్డి, జైత్రాం రాథోడ్ పాల్గొన్నారు.

నత్తనడకన 'లక్ష్మి' ఆధునికీకరణ

- ఐదేళ్ల క్రితం నిధుల విడుదల
- ఎట్టకేలకు పునఃప్రారంభమైన కాలువ మరమ్మతు పనులు
- ఎల్–4 కాలువలో పూడిక తొలగిస్తున్న అధికారులు



రెంజర్ల వద్ద లక్ష్మి మైనర్ కాలువలో పొక్లెయిన్‌తో పూడిక తొలగిస్తున్న దృశ్యం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీరు సరఫరా చేసే లక్ష్మి కాలువ ఆధునికీకరణ పనులు పునఃప్రారంభమయ్యాయి. లక్ష్మి కాలువ మైనర్ కాలువ ఎల్–4కు ప్రస్తుతం నీరు సరఫరా కావడం లేదు. దీంతో పూడికతీత పనులు ప్రారంభించారు. కాలువ ఆధునికీకరణ కోసం ప్రభుత్వం 2017లో భారీగా నిధులను మంజూరు చేసింది. 2018లో పనులను ప్రాంభించారు. అప్పటి నుంచి పనులు సాగుతునే ఉన్నాయి. ఇప్పటికీ పూర్తి కాలేదు. ముందుగా చేపట్టిన పనులు మళ్లీ మరమ్మతులకు వస్తున్నాయి. కానీ చివరి వరకు పనులు చేపట్టడంలేదు. సకాలంలో బిల్లులు రాకపోవడం ఓ కారణమైతే... కాంట్రాక్టర్ కూడా పనులు సకాలంలో చేపట్టకపోవడం మరోకారణం. కాలువల ద్వారా నీటి విడుదల జరుగుతుండటంతో అన్ సీజన్‌లో పనులు చేపట్టాల్సి వేగవంతంగా పూర్తి చేయాలి. కానీ నీటి విడుదల ప్రారంభించే పది రోజుల ముందు పనులు ప్రారంభించి, నీటి విడుదల మొదలు కాగానే నిలిపి వేస్తున్నారు. దీంతో పనులు ఒక్క అడుగు ముందుకు, ఆరు అడుగులు వెనక్కు అన్నట్లు సాగుతున్నాయి. లక్ష్మి డీ–4 కాలువలో ఎల్–4 ముప్కాల్ మండలంలోని రెంజర్ల గ్రామం పక్క నుంచి వెంచిర్యాల్ వరకు ప్రవహిస్తుంది. గత ఐదారేళ్లుగా ఆ కాలువ ద్వారా ఆయకట్టుకు నీటి సరఫరా కావడం లేదు. అయిన అధికారులు పట్టించుకోలేదు. మరమ్మతులు చేపట్టలేదు. ప్రస్తుతం కాలువలో పూడిక తీసే పనులు చేపడుతున్నారు. ఏటా అదే కాలువలో పేరుకు పోయిన పూడిక తొలిగించడం మళ్లీ చేతులేత్తేయడం ఇదే తంతు జరుగుతుంది. పాలకులు, ఉన్నత అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపే విధంగా పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

అన్నదాతల అవస్థలు

బాల్కొండ: లక్ష్మి కాలువ మైనర్ కాలువలు పిచ్చి మొక్కలు, ముళ్లపొదలతో నిండిపోవడంతో అన్నదాతలు అనేక అవస్థలు పడుతున్నారు. కాలువకు అడ్డంగా ముళ్లపొదలు ఉండటంతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. దీంతో రైతులే స్వయంగా పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు తొలగించారు. ప్రతి సంవత్సరం



నీటి విడుదలకు ముందు కాలువలో పూడిక తొలగించాలని రైతులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

లక్ష్మికాలువ ఎల్–4 ద్వారా నీరు వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. గ్రామం పక్క నుంచి కాలువ ఉండటంతో ప్రతి సంవత్సరం చెత్త చెదారంతో కాలువ నిండి పోతుంది. దీంతో ప్రవాహానికి అడ్డుగా మారుతోంది. పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను ఇదివరకే ఆదేశించాం.

– సురేశ్, డిప్యూటీ ఈఈ, మైనర్ ఇరిగేషన్, బాల్కొండ

విద్యార్థులకు అంబలి

- వారంలో మూడు రోజులు అందించాలని విద్యాశాఖ ఆదేశం
- ఈ నెలలో ప్రారంభానికి ఏర్పాట్లు



పాఠశాలలకు సరఫరా చేసిన రాగి పిండి, బెల్లం

మోర్తాడ్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మధ్యాహ్నం భోజనంలో అంబలి(రాగిజావా) పంపిణీ చేయడానికి విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. అంబలి ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందుతుందని భావించిన విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. రాగిజావా పంపిణీని పాఠశాలల పునః ప్రారంభం రోజునే మొదలు పెటాల్సి ఉంది. రాగి పిండి, బెల్లం సరఫరాలో జాప్యం జరగడంతో ఈనెల నుంచి ఆరంభించనున్నారు. వారం రోజుల కింద మండల విద్యావనరుల కేంద్రాలకు రాగి పిండి, బెల్లం ప్యాకెట్‌లను సరఫరా చేయగా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పరిగణలోకి తీసుకుని నెలకు సరిపడేంత కోటాను కేటాయించారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో రాగి అంబలి అందించాల్సి ఉంది. కోడిగుడ్డు ఇవ్వని రోజున రాగిజావా పంపిణీ చేయనున్నారు. ఏజెన్సీలకు ఈ మేరకు సూచనలు చేశారు. అంబలి ఎలా తయారు చేయాలో కూడా ఏజెన్సీ నిర్వాహకులకు ప్రధానోపాధ్యాయుల ద్వారా అవగాహన కల్పించారు. ఈ విషయమై మోర్తాడ్ మండల విద్యాశాఖ అధికారి ఆంధ్రయ్య 'సాక్షి'తో మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించడంలో భాగంగానే రాగిజావాను తయారు చేసి అందించనున్నామని తెలిపారు.

చీడపీడల నుంచి పంటలను కాపాడుకోవాలి



లింగాపూర్‌లో పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ

కామారెడ్డి రూరల్: లింగాపూర్‌లో శుక్రవారం వరి పొలాలను ఏడీఏ అపర్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పొలాలలో ఎక్కువగా కాండం తొలిచే పురుగు బాగా ఆశిస్తోందని, ఇది నారుమడి దశలో ఆశిస్తే మొవ్వలు ఎండిపోయి చనిపోతాయన్నారు. అంకురం నుంచి చిరు పొట్ట దశలో ఆశిస్తే ఈ నెల తర్వాత తెల్ల కంకులు బయటకు వస్తాయన్నారు. దీని నివారణకు కార్బోహైరాన్ 3జీ గుళికలు ఎకరానికి 10 కిలోల చొప్పున లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటర్ నీటికి కలుపుకొని ఎకరానికి పిచికారీ చేసుకోవాలన్నారు. లేదా క్లోరిన్‌ట్రనిప్రోల్ 0.4ఏ గుళికలు నాలుగు కేజీలు ఎకరానికి వెదజల్లాలన్నారు. రైతులు గనక ఈ జాగ్రత్తలు తీసుకుంటే మువ్వ పురుగు నుంచి పంటను కాపాడొచ్చని పేర్కొన్నారు. సకాలంలో కలుపు తీసి ఎకరానికి 20 కేజీల యూరియా మాత్రమే వెదజల్లుకోవాలన్నారు. ఆమె వెంట ఏవో శ్రీనివస్‌రావు, ఏఈవో తేజశ్విని, తదితరులున్నారు.

డిప్యూటీ తహసీల్దార్లకు పదోన్నతి

సుభాష్‌నగర్: రాష్ట్రంలోని డిప్యూటీ తహసీల్దార్ల(డీటీ)కు తహసీల్దార్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. అదేసమయంలో పదోన్నతి పొందిన వారికి మల్టీజోన్–1 పరిధిలోని జిల్లాలకు కేటాయించింది. జిల్లావ్యాప్తంగా 75 మంది వరకు డిప్యూటీ తహసీల్దార్లు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో 16 మంది పదోన్నతి పొందగా, అందులో 8 మంది ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు. అలాగే మరో ఏడుగురు తహసీల్దార్లు ఇతర జిల్లాల నుంచి మన జిల్లాకు వస్తున్నారు.

పదోన్నతి పొందిన డీటీలు	కేటాయించిన జిల్లాలు
నారాయణ	మెదక్
సురేశ్	ఆసిఫాబాద్
మహేశ్	నిజామాబాద్
సూర్యారావు	నిజామాబాద్
విఠల్	నిజామాబాద్
జనార్దన్	కామారెడ్డి
వరప్రసాద్	ఆదిలాబాద్
శ్వేత	నిజామాబాద్
బాల లక్ష్మి	మెదక్
అబ్దుల్ అజీజ్	మెదక్
విజయలక్ష్మి	మెదక్
రజినికుమారి	మెదక్
రవీందర్	మంచిర్యాల్
రమణ్‌కుమార్	నిజామాబాద్
ముజీబ్	ఆసిఫాబాద్
ప్రవీణ్	ఆదిలాబాద్

జిల్లాకు వస్తున్న తహసీల్దార్లు

పేరు	పూర్వ జిల్లా
శాంత	కామారెడ్డి
బాల్‌రాజ్	కామారెడ్డి
ఖాజాకుత్బుద్దీన్	కరీంనగర్
రమేష్	ఆదిలాబాద్
సదానందం	పెద్దపల్లి
షబ్బీర్	నిర్మల్
వనజరాణి	కామారెడ్డి

సేంద్రియ సాగుతో లాభాలు





కొత్తపల్లిలో మాట్లాడుతున్న నవీన్‌కుమార్, హసాకొత్తూర్‌లో పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మాచారెడ్డి: సేంద్రియ వ్యవసాయంతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ నవీన్‌కుమార్ సూచించారు. మండలంలోని కొత్తపల్లిలో మల్లారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సేంద్రియ సాగుపై జిల్లాలోని పలు గ్రామాల రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి రమ్యశ్రీ మాట్లాడుతూ జీవన ఎరువులు, డీఏపీ దుక్కిలో వేసుకోవాలని సూచించారు. ఆర్ఎఫ్ డీపీఎం రాజు, రంజిత్, శ్వేత, వీరేశం, సర్పంచ్ లక్ష్మణ్, రైతులు మల్లారెడ్డి, శ్రీకాంత్, చంద్రయ్య, యూసుఫ్, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు వినాయక్, ప్రసాద్, సతీష్, నాగేందర్, నర్సింలు పాల్గొన్నారు.

సోయా పంట పరిశీలన

కమ్మర్‌పల్లి: మండలంలోని హసాకొత్తూర్‌లో సాగవుతున్న సోయాబీన్ పంటలను రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. శాస్త్రవేత్త విజయ్‌కుమార్ మాట్లాడుతూ అధిక వర్షాల తర్వాత పొడి వాతావణంతో సోయా చిక్కుడు పంటలో ప్రస్తుతం కాండం కుళ్లు, పల్లాకు తెగుళ్ల ఆశించినట్లు తెలిపారు. దీంతో పాటు కాండం ఈగ, పెంకు పురుగు కూడా మోస్తరు వరకు ఆశించిందని చెప్పారు. కాండం కుళ్లు ఆశించడంతో మొక్కలు గుంపులు గుంపులుగా చనిపోతాయని తెలిపారు. దీని నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి చొప్పున లేదా ఉధృతి ఎక్కువగా ఉంటే ట్రిఫ్లోక్సిస్ట్రోబిన్, టీబ్యుకొనజోల్ 0.4 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్ల తడిచేల పిచికారి చేసుకోవాలన్నారు. పళ్ళాకు తెగులు నివారణకు అసిటమెప్రిడ్ 0.2 గ్రాములు లేదా డైఫెన్థ్యురాన్ 1.25 గ్రా లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసి నివారించుకోవచ్చని తెలియజేశారు. సేద్య విభాగం శాస్త్రవేత్త ఎం సురేష్ మాట్లాడుతూ సోయాలో వివిధ పోషక లోపాలు, వాటి నివారణ గురించి వివరించారు. ఏవో లావణ్య, ఏఈవో సాయిరాం, సర్పంచ్ ఏనుగు పద్మ, ఉప సర్పంచ్ రాజేశ్వర్, రైతుబంధు సమన్వయ కర్త నోముల నరేందర్, సొసైటీ వైస్ చైర్మన్ గడ్డం శ్రీధర్ పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి ఇవ్వాలని రాస్తారోకో



ఆందోళన చేస్తున్న బీజేవైఎం నాయకులు

సుభాష్‌నగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి రూ.3016 ఇవ్వాలని, లేకుంటే రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్తామని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సందగిరి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని పూలాంగ్ చౌరస్తాలో నిరుద్యోగ భృతి చెల్లించాలని రాస్తారోకో నిర్వహించారు. రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నిరుద్యోగులను నిండా ముంచుతుందన్నారు. పాలన మరిచి ఫాం హౌజ్‌కు పరిమితమైన సీఎం కేసీఆర్‌ను రోడ్డుకు ఈడ్చుతామని, ఈవిషయమై పలుమార్లు ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వంలో చలనంలేదన్నారు. రాష్ట్రంలో వైన్స్ టెండర్ల మీద ఉన్న శ్రద్ధ నిరుద్యోగులపై లేదని ఎద్దేవా చేశారు. గ్రూప్–2 పరీక్షల నిర్వహణకు కొంత సమయం ఇవ్వాలని, ఇప్పటివరకూ మెటీరియల్ రాలేదన్నారు. తూతూ మంత్రంగా నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించడం సమంజసం కాదన్నారు. అంతకుముందు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. బీజేవైఎం రాస్తారోకోతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేయగా, ఇరువురికి స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆమంద్ విజయ్‌కృష్ణ, మందుల బాలు, రాష్ట్ర అదనపు కార్యదర్శి ఎర్రం సుధీర్, చిరంజీవి, పిల్లి శ్రీకాంత్, నాగ సురేష్, సతీష్‌రెడ్డి, సాయికుమార్, సురేష్, భగత్, సంజీవ్, గంగోని లక్ష్మణ్, చైతన్య కులకర్ణి పాల్గొన్నారు.

గల్ఫ్ ఏజెంట్ అరెస్ట్



డిచ్‌పల్లి: గల్ఫ్ దేశాలకు పంపిస్తామని డబ్బులు తీసుకొని ఉడాయించిన ఎడపల్లి మండలం ఎంఎస్ ఫారంనకు చెందిన బషీర్ అబ్దుల్ కుర్షున్ (31)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. వివరాలు.. బషీర్ డిచ్‌పల్లిలో ట్రావెల్స్‌ను ఏర్పాటు చేసి, చుట్టూ పక్కల గ్రామాల ప్రజలకు గల్ఫ్ దేశంలో మంచి ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి మోసం చేశాడు. నడిపల్లి గ్రామానికి చెందిన రంజిత్ దగ్గర డబ్బులు తీసుకొని గల్ఫ్ పంపకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడి నుంచి కారును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న డిగ్రీ, పీజీ కళాశాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రిజిస్ట్రార్ యాదగిరిని కలిసి వినతిపత్రం అందజేశారు. రాజేశ్వర్ మాట్లాడుతూ గతంలో పని చేసిన రిజిస్ట్రార్లు పలు డిగ్రీ, పీజీ కళాశాలలకు వసతులు లేకుండానే అనుమతులు ఇచ్చారన్నారు. కామన్ సర్వీస్, అఫిలియేషన్ ఫీజు చెల్లించని కళాశాలలకు పర్మిషన్ రెన్యూవల్ చేస్తున్నారని విమర్శించారు. కొన్ని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని రిజిస్ట్రార్ దృష్టికి తెచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతూ, అఫిలియేషన్ ఫీజు చెల్లించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురుకుల పరీక్షలను దృష్టిలో పెట్టుకుని ఈ నెల 14 నుంచి జరిగే సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. నాయకులు దేవిక, రవీందర్, అక్షయ్, శివసాయి, అశ్విత్ పాల్గొన్నారు.

కుంటలో పడి యువకుడి మృతి

డొంకేశ్వర్: డొంకేశ్వర్ మండల పరిధిలోని తొండాకూర్ శివారు వద్ద నీటి కుంటలో పడి నందిపేట్‌కు చెందిన ఆదిముల్ల సాయికిరణ్ (21) మృతి చెందాడు. ఎస్సై రాహుల్ తెలిపిన వివరాలు.. సాయికిరణ్ ఈ నెల 9న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ద్విచక్ర వాహనంపై కుద్వాన్‌పూర్ నుంచి తొండాకూర్ వైపు వస్తుండగా ఇటీవల వర్షాలకు రోడ్డు తెగిన నీటి కుంటలో పడి మరణించినట్లుగా భావిస్తున్నామని ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

మస్కట్‌లో పోచంపాడ్‌వాసి మృతి



రాజేందర్ (ఫైల్)

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌కు చెందిన మైలారం రాజేందర్(45) మస్కట్‌లో గుండెపోటుతో నాలుగు రోజుల క్రితం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. రాజేందర్ కొన్నేళ్లుగా బతుకు దెరువు కోసం మస్కట్‌లో ఉంటున్నాడు. మంగళవారం ఆయన గదిలో గుండెపోటుతో మృతి చెందినట్లు తోటి కార్మికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శుక్రవారం గ్రామానికి మృతదేహం రావడంతో అంత్యక్రియలను నిర్వహించారు.

కరెంట్ షాక్‌తో రైతు..



సీతారామ్(ఫైల్)

మాచారెడ్డి: కరెంట్ షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన మండలంలోని తడ్కపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన అజ్మీరా సీతారామ్(47) గ్రామ శివారులోని పొలం వద్ద వరి నాటు వేస్తున్నారు. బోరు మోటారు నుంచి నీళ్లు రాకపోయేసరికి స్టార్టర్ సరి చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. అది గమనించిన సీతారాం ఇద్దరు భార్యలు స్థానికులకు సమాచారమందించారు. స్థానికుల సాయంతో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరు..

పెద్దకొడప్‌గల్: బైక్ అదుపు తప్పి ఒకరు మృతి చెందిన ఘటన పెద్దకొడప్‌గల్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పిట్లం మండలం తిమ్మానగర్ గ్రామానికి చెందిన గొల్ల కిష్టయ్య(48) తన కూతురిని చూడటానికి కాటెపల్లి గ్రామానికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా పెద్దకొడప్‌గల్ సమీపంలో బ్రిడ్జి పక్కన సర్వీస్ రోడ్డుపై బైక్ అదుపు తప్పి కిష్టయ్య కింద పడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కూతురు మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

- మృతులు తోడల్లుళ్లు
- జాతీయ రహదారిపై లారీ ఢీకొనడంతో ఘటన



మహమ్మద్ హైమద్, అక్తర్ అలీ (ఫైల్)

ఇందల్వాయి: ఇందల్వాయి పోలీస్ స్టేషన్ ఎదుట జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరు వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది మృతి చెందారు. వివరాలు.. కామారెడ్డి పట్టణంలోని ఇస్లాంపురకు చెందిన మహమ్మద్ హైమద్(46), సైలానీ బాబా కాలనీకి చెందిన అక్తర్ అలీ(48) తోడల్లుళ్లు. హైమద్ డీఎంహెచ్‌వో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా, అక్తర్ అలీ మలేరియా నివారణ డిపార్ట్‌మెంట్‌లో మల్టీ పర్పస్ హెల్త్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. హైమద్‌కి ఇద్దరు భార్యలు, నలుగురు కూతుళ్లు ఉన్నారు. కొడుకు ఈ మధ్యనే అనారోగ్యంతో మృతి చెందాడు. అక్తర్ అలీకి ఒక కూతురు, ఇద్దరు కొడుకులు ఉన్నారు. హైమద్ శుక్రవారం ఉదయం విధులకు హాజరైన అనంతరం సొంత పనులు నిమిత్తం అక్తర్ అలీని తీసుకొని నిజామాబాద్ వెళ్లాడు. పనులు ముగించుకొని తిరిగి వస్తుండగా వీరి బైక్‌ను వెనక నుంచి గుర్తు తెలియని లారీ వేగంగా ఢీకొంది. ఆ లారీ వీరి పైనుంచి వెళ్లడంతో అక్తర్ అలీ శరీరం ఛిద్రమై ఘటనా స్థలంలోనే మృతి చెందగా, హైమద్‌ని టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై మహేశ్ తెలిపారు.

కరెంట్ షాక్‌తో గాయపడిన బాలిక కాలు, చేయి తొలగింపు

ఖలీల్‌వాడి: కరెంట్ షాక్‌తో గాయపడిన బాలిక కాలు, చెయ్యి తొలగించారు. ఆరో టౌన్ ఎస్సై మొగిలయ్య తెలిపిన వివరాలు.. అర్సపల్లిలో ఇంట్లోని బాల్కనీలో ఆడుతూ రేష్మా మజీది(14) జూలై 1న కరెంట్ షాక్‌కు గురైంది. తీవ్రంగా గాయపడిన బాలికను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ ఆమె చేయి, కాలు తొలగించారు. ఈ ఘటనపై రేష్మా తండ్రి రావూఫ్ శుక్రవార పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దాడి చేసిన యువకులపై ఫిర్యాదు

ఎడపల్లి: మండలంలోని జానకంపేట శివారులోని అలీసాగర్‌కు వెళ్తున్న రోనక్, అఖిలేష్‌పై దాడికి పాల్పడిన వారిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం సాయంత్రం అలీసాగర్ పార్క్ వద్ద ఓ వర్గానికి చెందిన ఏడుగురు యువకులు రోనక్, అఖిలేష్‌పై దాడి చేసి ఫోన్, డబ్బులు లాక్కున్నారు. ఘటనపై ఎడపల్లి ఠాణాలో ఫిర్యాదు చేస్తే పోలీసులు నిర్లక్ష్యమైన సమాధానం చెప్పడంతో బాధితులు హిందు సంఘాల దృష్టికి తీసుకువెళ్లారు. హిందూ సంఘాల నాయకుడు పటేల్ ప్రసాద్ పోలీసులతో మాట్లాడారు. నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

మనస్తాపంతో వృద్ధురాలి ఆత్మహత్య

రెంజల్: కూతుళ్లతో జరిగిన గొడవతో మనస్తాపం చెంది ఓ వృద్ధురాలు కందకుర్తి వద్ద గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మోస్రా మండలం చింతకుంటకు చెందిన సాయవ్వ(70) ఈ నెల 7న తన ఇద్దరు కూతుళ్లతో గొడవ పడింది. మనస్తాపం చెందిన 8న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. నదిలో మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి మనవడు గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

భిక్కనూరు: మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరికి శుక్రవారం కామారెడ్డి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ మూడు రోజుల జైలు శిక్ష, రూ.200 జరిమానా విధించినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపారు. కామారెడ్డి మండల నర్సన్నపల్లి గ్రామానికి చెందిన సంజీవులు, అడ్లూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ జమలోద్దీన్ మద్యం తాగి వాహనాలను నడిపినందుకు న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచామన్నారు.

ఇద్దరిపై కేసు

మోపాల్: మండలంలోని సిర్‌పూర్ గ్రామానికి చెందిన బలసాని జ్ఞానేశ్వర్ గౌడ్, బబ్లుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాము శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన శ్రీహరి గౌడ్‌పై బుధవారం రాత్రి పాత కక్షలను మనస్సులో పెట్టుకుని జ్ఞానేశ్వర్ గౌడ్, బబ్లు దాడికి పాల్పడ్డారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.